మనం
కడప | అన్నమయ్య

## బ్రాంచ్ మెడల్ సాధించిన విశ్వనాథ్





రాజంపేట మార్చి 22(మనం న్యూస్) ఆంధ్ర ప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 8వ యూత్ (అండర్ 19) ఏపీ స్టేట్ మెన్ బాక్సింగ్ ఛాంపియన్షిప్ - 2026 రాజంపేట బాక్సింగ్ క్లబ్ నుండి విశ్వనాథ్ అనే అబ్బాయి యూత్ అండర్ 19 పోటీలలో పాల్గొని బ్రాంచ్ మెడల్ సాధించడం జరిగింది. కోచ్ ఆనందా చారి ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో పాటిస్పేట్ చేసి బ్రాంచ్ మెడల్ సాధించడం జరిగింది.

# పనులు పూర్తయి ఏడేండ్లు
# ప్రారంబానికి ఇంకెన్నేళ్లు?

## ప్రారంభానికి నోచుకోని సచివాలయం - తడిసిమోపేడవుతున్న అద్దె



నిరుపయోగంగా నూతన సచివాలయం

రాజంపేట మనం న్యూస్ మార్చి 22: ప్రజలకు ప్రభుత్వ సేవలను దగ్గర చేయడానికి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసింది ప్రభుత్వం... ఉన్నత ఆశయంతో ఏర్పాటైన సచివాలయం పూర్తయి ఏదేళ్లు గడుస్తున్నా ప్రారంబానికి నోచుకోకపోవడం విస్మయం కలిగిస్తోంది. అద్దె భవనంలో కొనసాగుతున్న సచివాలయానికి లక్షలలో అద్దె చెల్లిస్తూ ప్రజాధనం దుర్వినియోగం అవు తున్నా ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకెలితే.. కడపజిల్లా నందలూరు మండలపరిధిలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సచివాలయం అద్దె భవనంలో కొనసాగుతుంది. నూతన భవనం సచివాలయం-1 పనులు పూర్తయి ఏడేండ్లవుతున్న ప్రారంబించక పోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సచి వాలయం అద్దెభవనాలలో నిర్వహిస్తూ లక్షలలో ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం ఎమిటని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ ప్రారంభ అంశాన్ని ఎన్నిసార్లు పిజిఆర్ఎస్ లో ఫిర్యాదు చేసిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పట్టించుకోలేదని వాపోతున్నారు. జిల్లాలోనే నాగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీకి ప్రత్యేక గుర్తింపు వుంది. జిల్లాలోని మేజర్ గ్రామపంచాయతీలో ఈ పంచాయతీ కూడా ఒకటిగా చెప్పొచ్చు. అనేక సంవత్సరాలుగా గ్రామ పంచాయతీ ప్రజలకు సేవలు అందించిన కార్యాలయాన్ని పడగొట్టి సచివాల నిర్మాణానికి ఏడేళ్ల క్రితం 40 లక్షల రూపాయలతో పనులు ప్రారంభించారు. ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన గ్రామపంచాయతీ కార్యాలయం అక్కడే ఉంచాల్సింది పోయి దాన్ని పగలగొట్టి కొత్త సచివాలయం నిర్మాణం చేపట్టడంతో ప్రజలు అయోమయానికి గురయ్యారు. అనేక మేజర్ గ్రామపంచాయతీలలో గ్రామపంచాయతీ కార్యాలయం అక్కడే ఉండిచ్చి నూతన సచివాలయాలను పక్కన నిర్మించారు. అయితే ఇక్కడి అప్పటి ప్రజాప్రతినిధుల నియంతృత్వ ధోరణి మూలంగా బాగా ఉన్న కార్యాలయం పగలగొట్టి సచివాలయం నిర్మాణం చేపట్టడం దారుణమైన విషయం అని ప్రజలు వర్షాలు చేస్తున్నారు. అయితే సచివాలయ నిర్మాణం చేపట్టి ఎడేళ్లు కావస్తున్న ఇప్పటికి దానిని ప్రజలకు అందుబాటులోకి తెక పోవడం బాధాకరం. ఓ వైపు కాంట్రాక్టర్ మరోవైపు అధికారుల నిర్లక్ష్యం మూలంగా లక్షల రూపాయల ప్రజాధనం వృధాగా బాడుగ రూపంలో చెల్లిస్తుండడం జరుగుతుంది. సచివాలయం లోపల విద్యుత్తు పనులు చిన్న చిన్న పనులు ఉన్నప్పటికీ దాన్ని పూర్తి చేయాలన్న ఆలోచన అధికారులకు లేకపోవడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా సచివాల యాలు అన్ని పూర్తయి ప్రజలకు సేవలు అందిస్తున్న ప్పటికీ నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం మాత్రం ఇప్పటికి ప్రారంభించకపోవడంలో అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన పాత్రగా చెప్పవచ్చు నని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుత పాలకవర్గం అనేకమార్లు అధికారులకు తెలిపిన వారు పట్టి పట్టినట్లు వ్యవహరించడంతో కాంట్రాక్టర్ కూడా ఇందుకు సహకారం అందించారన్న ఆరోపణలు ఉన్నాయి. కేవలం రాజకీయం మూలంగానే ఈ సచివాలయం ప్రారంభించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలోనే పూర్తి చేసి ప్రారంభించాల్సిన ఈ సచివాలయం పనులు అట కెక్కించారు. కూటమి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు కావస్తున్న ఈ సచివాలయం వ్యవహారంపై చర్యలు తీసుకోక పోవడం లో ఆంతర్యం అర్థం కాని విషయం గా మారింది. ఇక పంచాయతీరాజ్ శాఖ అధికారులు సచివాల య నిర్మాణం పూర్తి చేసి గ్రామపంచాయతీకి అప్పగించాల్సిన బాధ్యతను విస్మరించడంతో గత ఏడేళ్లుగా లక్షలాది రూపాయల ప్రజాధనం బాడిగ రూపంలో పోతుండడం జరుగుతుంది. మరి ఎంత జరుగుతున్న అధికార యంత్రాంగం ఇప్పటికి స్పందించకపోవడం పట్టినట్లు వ్యవహరించడం వెనక రాజకీయ కుట్ర ఉన్నట్లు ప్రజలు భావిస్తున్నారు. ప్రస్తుత పాలకవర్గం పరిపాలన ఏప్రిల్ రెండో తేదీకి ముగుస్తున్నప్పటికీ వారి నూతన సచివాలయ ప్రారంభమసులు ఆవిరి అయినట్లేనని చెప్పవచ్చు. సచివాల సమస్యలన్నీ అధికారులకు తెలిసిన అప్పటి ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం మూలంగా ఈ సచివాలయ నిర్మాణం అరకెక్కించడం గమనార్హం. ఇక అధికార యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి సచివాలయ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.





అద్దె భవనంలో కొనసాగుతున్న సచివాలయం

## అగ్ని ప్రమాద బాధితులకు తక్షణ సాయం అందించిన ఎమ్మార్వో అమర్నాథ్



రైల్వేకోడూరు, మార్చి 22, మనంన్యూస్: తిరుపతి జిల్లా రైల్వేకోడూరు మండల పరిధిలోని స్థానిక రెడ్డివారిపల్లి గ్రామం నందు వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి దంపతులిద్దరూ శనివారం ఉదయం తమ జీవనోపాధి నిమిత్తం పనులకు వెళుతూ ఇంట్లో దీపారాధన చేసుకొని నలుగురు బిడ్డలను పాఠశాలకు పంపించడం జరిగింది. హఠాత్తుగా ప్రమాదవశాత్తు ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైన విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకొని ఇంటికి వచ్చేసరికి ఇంట్లోని సామాన్లు బట్టలు బియ్యం ఇతర వస్తువులు అన్ని మంటలు కాలి బూడిదైపోయాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న రైల్వేకోడూరు ఎమ్మార్వో కోనేటి అమర్నాథ్ బాధితులకు నిత్యావసర సరుకులు, బియ్యం, తగినంత ఆర్థిక సాయం చేసి తన ఉదారతను చాటుకోవడం జరిగింది. తమ సమస్య తెలుసుకొని స్పందించిన ఎమ్మార్వోకి బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు. అంతేకాకుండా సమాచారం అందుకున్న చాలామంది సేవా సంస్థలు, సామాజిక సంస్థలు వారికి సహాయ సహకారాలు తమ శక్తి మేర చేయడం జరుగుతుంది.

## రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారం అందుకున్న బండాత్మకూరు సుదర్శన్‌శర్మ



రైల్వే కోడూరు, మార్చి 22, మనంన్యూస్: తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండల పరిధిలోని లక్ష్మీగారి పల్లి నివాసి రైల్వే కోడూరు శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపకులు పురోహితులు డాక్టర్ బండాత్మకూరు సుదర్శన్ శర్మకు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షులు కే సతీష్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ నుండి రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కార అవార్డును బహూకరించడం జరిగింది. ఈ సందర్భంగా సుదర్శన్ శర్మ మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా, సామాజికంగా నిరుపేద ప్రజలకు చేసిన సేవలను గుర్తించి ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య వారు రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కార అవార్డును నాకు ఎంపిక చేయడం అది ఈనాడు అందుకోవడం నాకు చాలా ఆనందంగా ఉందని అంతేకాకుండా నాకు ఈ అవార్డు రావడానికి సహకరించిన రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజలకు, పాత్రికేయులకు, సమాజ సేవకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ సంఘ సమాఖ్య సభ్యులు ద్రాక్షాయని, సి ఆర్ కే శేషగిరిరావు, డాక్టర్ ఏ ఎల్ యన్ శాస్త్రి, మురళి హాజరయ్యారు.


## చమర్తి జగన్మోహన్ రాజును కలిసిన మాలమహానాడు నేతలు


**రాజంపేటలో అంబేద్కర్ భవన నిర్మాణానికి భూమిని కేటాయించాలని విన్నపం**

**సానుకూలంగా స్పందించిన జగన్మోహన్ రాజు**

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి స్థలకేటాయింపుకు కృషి చేస్తానని మాలమహానాడు నేతలకు హామి**

రాజంపేట మనం న్యూస్ మార్చి 22: పేదల పక్షమైన కూటమి ప్రభుత్వం సమసమాజానికి కృషి చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన నిర్మాణానికి రాజం పేటలో స్థలం కేటాయించాలని నేడు మాల మహానాడు నేతలు టీడీపీ నియోజకవర్గ ఇంఛార్జ్ చమర్తి జగన్మోహన్ రాజును ఆయన కార్యాలయంలో కలిసి కోరారు. అలాగే భవన నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన జగన్మోహన్ రాజు అంబేద్కర్ భవన్ నిర్మాణానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తాని, స్థల కేటాయింపు జరిగేలా చూస్తానని వారికి హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని.. పేదల కోసం బడుగు బలహీన వర్గాలకోసం కృషి చేసిన మహనీయుడు అంబేద్కర్ అని అటువంటి మహనీయుడు పేరుతో భవన నిర్మాణం చేయడం అందరికీ ఆదర్శమన్నారు. అంబేద్కర్ బాటలో కూటమి ప్రభుత్వం నడుస్తుందని.. పేదరిక నిర్మూలన కోసం బడుగు బలహీన వర్గాల ఉన్నతి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అధికారం, పదవులలో పేదలను అందలమెక్కించిన పార్టీ టీడీపీ అన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనాలో భాగంగా ఏపీలో పేదరిక నిర్మూలన కోసం పీ4 వంటి మహత్త కార్యక్రమాలు చేపట్టి పేదరికాన్ని దూరం చేసేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం అంబేద్కర్ చూపించిన బాటలో నడుస్తూ..పేదల ఉన్నతికై వారి ఆర్థిక వృద్ధికై ప్రతినిత్యం పనిచేస్తుందని తెలిపారు. త్వరలోనే అంబేద్కర్ భవన నిర్మాణం ఏర్పాటు జరిగేలా చూస్తానని మాల మహానాడు నేతలకు ఈ సందర్భంగా జగన్మోహన్ రాజు భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో:ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగం సంజీవ్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్,అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పోలంరెడ్డి మల్లికార్జున, బహుజన సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు కూలి లక్ష్మీనారాయణ, మాల మహానాడు రాయలసీమ ఉపాధ్యక్షులు కొమ్మ ఎల్లయ్య, బాస్ జన చైతన్య సేవా సమితి అధ్యక్షులు మరియు అడ్వకేట్ జల్లి నారాయణ ,అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కాకి చంద్రమోహన్ ,అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, నన్ను శీను మోడపోతుల పాపయ్య,వీ. రాము మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సురేష్ ఆదినారాయణ పెంచలయ్య, దాసరి కళాధర్ రియల్ ఎస్టేట్ ఆవల జయరాం, ఆర్టీసీ నారాయణ పిల్లి చంద్రశేఖర్ బ్యాంకు రిటైడ్ మేనేజర్ టీచర్ నారాయణ బ్రాహ్మణపల్లి శీను , తదితరులు పాల్గొన్నారు.







# అకాల వర్షం, గాలుల ధాటికి దెబ్బతిన్న అరటి పంటను పరిశీలించిన ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్‌రాజు




రాజంపేట మనం న్యూస్ మార్చి 22: నియోజకవర్గ పరిధిలోని రాజంపేట మండలంలో ఈనెల 18వ తేదీన కురిసిన అకాల వర్షాలకు భారీగా పంట నష్టం వాటిల్లింది. ముఖ్యంగా హస్తవరం చెర్లోపల్లి, పెదకారంపల్లి గ్రామాల్లో నేలకొరిగిన అరటి తోటలను నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్మోహన్‌రాజు ఆదివారం సాయంత్రం పరిశీలించారు.

**నష్టపోయిన రైతుల వివరాలు:**
పర్యటనలో భాగంగా వర్షం ధాటికి దెబ్బతిన్న తోటలను స్వయంగా చూసి రైతులతో మాట్లాడారు. హస్తవరం **చెర్లోపల్లి:** కీర్తిపాటి శివమ్మకు చెందిన సుమారు మూడు ఎకరాల అరటి తోట పూర్తిగా ధ్వంసమైంది. పెదకారంపల్లి: రామ సుబ్బమ్మకు చెందిన ఒకటిన్నర ఎకరా అరటి పంట నేలకొరిగింది. ప్రాథమిక అంచనా ప్రకారం, ఈ అకాల వర్షం వల్ల రైతులకు సుమారు 12 లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.

**అధికారులతో మాట్లాడి భరోసా**
రైతులను పరామర్శించిన చమర్తి జగన్మోహన్ రాజు అక్కడి నుండే వ్యవసాయ శాఖాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. క్షేత్రస్థాయిలో నష్టాన్ని త్వరగా అంచనా వేసి, బాధిత రైతులకు ప్రభుత్వం నుండి తగిన నష్టపరిహారం అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కష్టాల్లో ఉన్న రైతులకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# రామేశ్వరంలో కన్నులపండుగగా చిన్నమ్మ, పెద్దమ్మల జాతర





ప్రొద్దుటూరు మార్చి 22 మనం న్యూస్ రామేశ్వరం, భక్తిప్రపత్తుల సమాహారం గ్రామ పొలిమేరల నుంచి నడిబొడ్డు వరకు ఎటు చూసినా చలవ పందిళ్ళు, తోరణాలతో రామేశ్వరం శోభాయమానంగా కనిపిస్తోంది. గ్రామ దేవతలు చిన్నమ్మ, పెద్దమ్మల జాతరను పురస్కరించుకుని ఊరంతా ఒక పండుగ వాతావరణం నెలకొంది. ఈ పవిత్ర పర్వదినాన ప్రతి ఇంటి నుండి భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ తల్లికి ఆగతి..మొక్కు.. సమర్పించి, తమ కులదైవాల పట్ల ఉన్న అచంచల విశ్వాసాన్ని చాటుకున్నారు.

**బంధుమిత్రుల కలయిక ఆనందాల వేదిక**
ఈ జాతర కేవలం మొక్కుల పండుగే కాదు, ఆత్మీయ అనురాగాల వేదికగా నిలిచింది. ఆడపడుచుల ముచ్చట్లు సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ఆడపడుచులు, బంధువులు ఒకచోట చేరి వంటలు వండుతూ, కష్టసుఖాలను పంచుకుంటూ మాటామంతి కలపడం గ్రామీణ సంస్కృతికి అద్దం పడుతోంది. పురుషుల సరదా సంభాషణలు..మగవారు బావమరిది, అల్లుడు, మామ అంటూ వరుసలతో పలకరించుకుంటూ, విందు వినోదాల్లో మునిగితేలుతూ రావోయ్ సామి.. ఒక చుక్కేద్దాం అంటూ ఆత్మీయంగా గడుపుతున్నారు.

**ఇంటింటికీ దేవతల ఆశీస్సులు**
స్థానికుల నమ్మకం ప్రకారం, ఈ జాతర రోజున చిన్నమ్మ, పెద్దమ్మలు స్వయంగా గ్రామమంతా కలియదిరుగుతారట. గ్రామంలోని ప్రతి ఇంటి గుమ్మం వద్దకు వచ్చి, ఆ ఇల్లాలు పెట్టే నైవేద్యాన్ని స్వీకరించి, కంటికి రెప్పలా కాపాడతామని అభయమిస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. గ్రామస్తుల ముఖాల్లో కనిపిస్తున్న ఆనందమే అందుకు నిదర్శనం. మా గ్రామానికి ఈ రోజు ఎక్కడలేని శుభం చేకూరింది. అమ్మవార్ల దయతో, చుట్టపక్కల వారందరి రాకతో మా ఇళ్లు కళకళలాడుతున్నాయి అని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సంప్రదాయబద్ధంగా, అంగరంగ వైభవంగా జరుగుతున్న ఈ జాతర రామేశ్వరం గ్రామ ఐకమత్యానికి, భక్తికి ప్రతీకగా నిలుస్తోంది.




## శిల్పారామంలో కొలువుదీరిన కళా వైభవం

### హస్తకళల ప్రదర్శనశాల ప్రారంభం


కడప మార్చి 22(మనం న్యూస్):స్థానిక శిల్పారామంలో ఆదివారం సందడి నెలకొంది. ప్రాచీన హస్తకళలకు పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా ఏర్పాటు చేసిన హస్తకళల ప్రదర్శనశాలను శిల్పారామం చైర్‌పర్సన్ చేరెడ్డి మంజులారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హస్తకళాకారులను ప్రోత్సహించేందుకు మరియు అంతరించిపోతున్న ప్రాచీన కళలను నేటి తరానికి పరిచయం చేసేందుకు ఈ ప్రదర్శనశాల ఒక వేదికగా నిలుస్తుందని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. తెలుగు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని, శిల్పారామం ప్రత్యేకంగా రూపొందించిన ఉగాది క్యాలెండర్‌ను ఆమె ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమం అనంతరం ఆమె శిల్పారామ మంతటా కలియతిరిగి సందర్శకులతో ముచ్చటించారు. వారికి అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకుంటూ, మరిన్ని మెరుగుదలలు చేపట్టాలని అధికారులను ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం ఏవో (ఏఓ) కృష్ణ ప్రసాద్, ఇతర ముఖ్య సిబ్బంది, సందర్శకులు పాల్గొన్నారు.

## రైతు బిడ్డ రికార్డు.. 'గేట్'లో 89వ ర్యాంకు!



కడప మార్చి 22(మనంన్యూస్): సాధారణ కుటుంబం నుండి వచ్చినప్పటికీ, అసాధారణ ప్రతిభతో జాతీయ స్థాయిని ఆకర్షించాడు తలారి మోహన్. జమ్మలమడుగు మండలం, ఎస్. ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఈ యువకుడు, ప్రతిష్టాత్మక గేట్ పరీక్షలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఆల్ ఇండియా 89వ ర్యాంక్ సాధించి రికార్డు సృష్టించాడు. బి.టెక్ చివరి ఏడాదిలోనే ఇంతటి ఘనత సాధించడం విశేషం. మోహన్ విజయం పట్ల అతని తల్లిదండ్రులు సంజీవరాయుడు, లక్ష్మీదేవి గర్వపడుతున్నారు.

## జనసేన మండల అధ్యక్షులు మాదాసు నరసింహ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు వెల్లువ




చిట్వేలి మార్చ్ 22 మనం న్యూస్ ప్రతినిధి: చిట్వేలీ మండల జనసేన అధ్యక్షులు మాదాసు నరసింహ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం సోషల్ మీడియా ద్వారా, వివిధ మధ్య మాల ద్వారా పలువురు జనసేన నాయకులు, కూటమి నేతలు, ప్రజలు పెద్ద ఎత్తున ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాదాసు నరసింహ జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్‌కళ్యాణ్ పార్టీ స్థాపించి నప్పటి నుండి ఎంతో బాధ్యతతో జనసేన పార్టీ మండల అధ్యక్షులుగా ఎన్నిక ఎన్నో కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ ప్రజల మద్దతు పొందుతూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ తనదైన శైలిలో రాజకీయంలో నిలదొక్కుకున్నారు. ఇలాగే మాదాసు నరసింహ మంచి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఇంకా పెద్ద పెద్ద పదవులు అధిరోహించాలని పలువురు స్నేహితులు, జనసేన నాయకులు, కార్యకర్తలు, కూటమి నేతలు, ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు.

## వెంకటసుబ్బమ్మ పార్థివదేహానికి నివాళులర్పించిన నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్‌రాజు



రాజంపేట మనం న్యూస్ మార్చి 22:నేడు రాజంపేట మండలం,తాళ్లపాక గ్రామం నందు పర్యటిస్తూ మేడిదిరాజు వెంకట సుబ్బమ్మ మరణించగా నేడు వారి స్వగృహం నందు వారి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లకు మాస్ వార్నింగ్: సిఐ



ముద్దనూరు, మార్చి, 22, (మనంన్యూస్): మండల పరిధిలోని రౌడీషీటర్లకు జిల్లాఎస్పీ నచికేత్ విశ్వనాథన్ ఆదేశాల మేరకు జమ్మలమడుగు డిఎస్పీ వెంకటేశ్వరరావు సూచనలతో ఆదివారం పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు సమావేశం నిర్వహించి శాంతిభద్రతలకు విఘతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు పోలీసు యంత్రాంగం తీసుకుంటుందని, రౌడీ షీటర్లు శాంతియుతంగా జీవించాలని సూచించారు. పోలీస్‌లు, రౌడీ షీటర్లు పాల్గొన్నారు.

## మార్కెట్ సిరులు.. రైతుల ఉరితాళ్లు!

### పెట్టుబడి రాక రైతు బేజారు.. పన్ను వసూళ్లలో యార్డుల జోరు

**ఖజానాకు కళ.. అన్నదాతకు వెలవెల!**

కడప మార్చి 22(మనంన్యూస్): తనువంతా చెమట బిందువులై, రక్తాన్ని ధారబోసి పండించిన పంటను మార్కెట్‌కు తెచ్చిన అన్నదాతకు అక్కడ ఎదురవుతున్నది ఆదరణ కాదు.. అడ్డగోలు నిబంధనల ఉరితాళ్లు. ఆకాశమే హద్దుగా పెరుగుతున్న పెట్టుబడులు, పాతాళానికి పడిపోతున్న గిట్టుబాటు ధరల మధ్య నలిగిపోతున్న రైతుకు మార్కెట్ యార్డుల పన్ను భారం మరో గుదిబండగా మారింది. పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించినా, లభించకపోయినా.. చివరకు నష్టాల్లో మునిగిపోయినా సరే, ప్రభుత్వానికి మాత్రం 'పన్ను' చెల్లించాల్సిందేనన్న నిబంధన జిల్లా రైతాంగాన్ని కుంగదీస్తోంది.

**ఖజానా నిండుతోంది.. రైతు కన్ను ఎండుతోంది!**

వైఎస్ఆర్ కడప జిల్లాలోని మార్కెట్ యార్డుల ఆదాయ గణాంకాలను గమనిస్తే ప్రభుత్వ ఖజానా కళకళలాడుతోంది. కానీ, ఆ సొమ్ము వెనుక ఎంతమంది రైతుల కన్నీరు ఉందో లెక్కతేలడం లేదు. గతేడాది జిల్లా వ్యాప్తంగా రూ 8.45 కోట్లు మార్కెట్ ఫీజు రూపంలో వసూలు కాగా, ఈ ఏడాది అది ఏకంగా రూ 19.10 కోట్లకు చేరింది. అంటే రైతులు నష్టాల్లో ఉన్నా, మార్కెట్ ఆదాయం మాత్రం ఏటా పెరుగుతూనే ఉండటం గమనార్హం.

**మండలాల వారీగా పన్ను పోటు:**

జిల్లాలోని ప్రధాన మార్కెట్ యార్డులు, వాటి పరిధిలోని మండలాల్లో రైతుల పరిస్థితి దారుణంగా ఉంది:

కడప మార్కెట్: కడప, సి.బెలగల్, చెన్నూరు, చింతకొమ్మదిన్నె, వల్లూరు మండలాల నుంచి వరి, పసుపు సాగు చేసే రైతులపై రూ 4.40 కోట్ల పన్ను భారం పడింది.

మైదుకూరు యార్డు: మైదుకూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట ప్రాంతాల్లో శనగ రైతులకు మద్దతు ధర దక్కకపోయినా, యార్డు మాత్రం రూ 3.65 కోట్లు పిండుకుంది.

పులివెందుల, రాజంపేట: అరటి, బొప్పాయి ఎగుమతులపై పట్టు సడలని పన్ను వసూళ్లు సాగుతున్నాయి. ఈ రెండు యార్డుల నుంచే దాదాపు రూ 5 కోట్లు ప్రభుత్వ ఖాతాకు వెళ్లాయి.

బద్వేల్, ప్రొద్దుటూరు: ఇక్కడి వరి, పత్తి రైతులు ధర లేక అల్లాడుతుంటే, యార్డులు మాత్రం సుమారు రూ 5.70 కోట్లు వసూలు చేసి లక్ష్యాలను చేరుకున్నాయి.

పన్ను పండగ.. సదుపాయాలు దండగ!


ప్రతి అమ్మకంపై 1% మార్కెట్ ఫీజు వసూలు చేస్తున్న కమిటీలు, యార్డుల్లో రైతులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో గాలికొదిలేశాయి. వర్షం వస్తే పంట తడవకుండా ఉండటానికి సరిపడా గోడౌన్లు లేవు, ఆరబోత వేదికలు చాలవు. పన్నుల రూపంలో కోట్లాది రూపాయలు పోగు చేస్తున్న అధికారులు, రైతుకు అవసరమైనప్పుడు మాత్రం నిధులు లేవని సాకులు చెబుతున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

**ప్రశ్నిస్తున్న అన్నదాత!**

"అప్పులు తెచ్చి సాగు చేస్తే, ఆ అప్పులు తీరక అల్లాడుతుంటే.. మా దగ్గర పన్ను వసూలు చేయడం ఏ న్యాయం?" అని జిల్లా రైతాంగం గొంతెత్తుతోంది. పెట్టుబడి కూడా రాని సమయంలో మార్కెట్ ఫీజుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, వసూలు చేసిన నిధులను ఆడంబరాలకు కాకుండా నేరుగా రైతు సంక్షేమ పథకాలకు మళ్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, మార్కెట్ యార్డులను 'రాబడి కేంద్రాలు'గా కాకుండా 'రైతు భరోసా కేంద్రాలు'గా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే ఈ మార్కెట్ సిరులు కాస్తా.. రైతుల పాలిట ఉరితాళ్లుగా మారే ప్రమాదం పొంచి ఉంది.

## ఉద్యానశాఖ అధికారిపై తీవ్రస్థాయిలో విమర్శలు



చిట్వేలి మార్చి 22 మనం న్యూస్ ప్రతినిధి: మండల ప్రజలకు సేవలు అందించాల్సిన ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజలకు అందవలసిన సబ్సిడీలు గాని ప్రత్యేక గ్రాంట్లు గాని, రైతులకు అందవు చిట్వేలీ మండలంలో ఉద్యానవన శాఖ అధికారిగా పనిచేస్తున్న అధికారి మండల ప్రజలకు అందుబాటులో ఉండడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వానికి సంబంధించిన ముఖ్యమైన కార్యక్రమాలలో మాత్రమే అతను హాజరు ఉంటుంది ఒక విధంగా గ్రీవెన్స్ సెల్ కు మాత్రమే ఆ అధికారి వస్తాడు తర్వాత అధికారి అందుబాటులో ఉండడం లేదు అని ప్రజలు విమర్శిస్తున్నారు రైతులకు పండ్ల కవర్లు బుట్టలు లాంటివి సబ్సిడీ రూపంలో అందుబాటులో ఉన్నాయని ప్రకటన విస్తా రూ కానీ అవి రైతుల దగ్గరికి తీసుకురావడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు ప్రతి సచివాలయాలలో వ్యవసాయ అధికారి ఉంటాడు కవర్లు గాని బుట్టలు గాని సచివాలయాల లో అందుబాటులో ఉంచితే రైతులు కచ్చితంగా వాటిని వినియోగించుకునే అవకాశం ఉంది కానీ ఆ అధికారి రైల్వే కోడూరు కి వచ్చి అవి. స్వీకరించాలని హూకుం జారీ చేయడంతో అవి ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు కనీసం ఫోన్ ద్వారానైనా సరే సూచనలు సలహాలు స్వీకరించాలన్నా కూడా ఫోన్ అందుబాటులో ఉండడం లేదని ఆ అధికారి పై విమర్శలు ఉన్నాయి ఇంతకుముందు తన పని చేసిన చోట అనేక విమర్శలు రావడంతో ఆ అధికారి బదిలీ పైన వచ్చారని చిట్వేలి మండలంలో ప్రజలకు అందుబాటులో ఉండారా అంటే ప్రజలకు అందించాల్సిన సేవలలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు ఏది ఏమైనప్పటికీ సంబంధిత అధికారి పూర్తిగా స్థాయిలో సేవలు ప్రజలకు అందించే విధంగా ఉన్నత స్థాయి అధికారులు ఆదేశాలు జరీచేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.